క్లుప్తంగా

తాగునీటి సమస్యను పరిష్కరించండి



సిరికొండ: తాగు నీటి సమస్యను పరిష్కరించాలని గడ్కోల్ గ్రామ పరిధిలోని తాళ్లగుండు కాలనీ వాసులు అధికారులను కోరుతున్నారు. ఈమేరకు వారు సిరికొండలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీవో తారాచంద్‌కు సోమవారం వినతిపత్రం అందచేశారు. గత కొన్నేళ్ల క్రితం అక్కడ నిర్మించిన మినీ ట్యాంకును మాజీ సర్పంచ్ కూల్చి వేయించడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారికి సమస్యను విన్నవించగా, ఆయన పంచాయతీ కార్యదర్శిని సమస్యను పరిష్కరించాలని ఆదేశించారన్నారు. కానీ మా సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. కాలనీవాసులు కన్యగౌడ్, సాయికుమార్, సుభద్ర, పోశెట్టి, నర్సవ్వ, రోజా, రాములు, ఎల్లయ్య పాల్గొన్నారు.

మొరం అక్రమ తవ్వకంపై ఫిర్యాదు



నిజామాబాద్ రూరల్: మండలంలోని సారంగాపూర్‌లో అక్రమంగా మొరం తవ్వకాలు నిర్వహిస్తున్నారని బీఆర్ఎస్ డివిజన్ ఇన్‌చార్జి అక్బర్ నవాజుద్దీన్ అన్నారు. ఈమేరకు ఆయన సోమవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు ఫిర్యాదు చేశారు. మొరం తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవని, అటవీ సంపదను అక్రమంగా కొల్లగొడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు ఆయన తెలిపారు. సారంగాపూర్ జిల్లా జైల్ పక్కన ఉన్న గుట్టల నుంచి అక్రమంగా మొరం తవ్వకాలు జరుతున్నట్లు తెలిపారు.

నగరంలో దుకాణాల బంద్



ఖలీల్ వాడి: మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం నగరంలోని నెహ్రూ పార్క్, ఖిల్లాతోపాటు పలు ప్రాంతాల్లో ముస్లింలు దుకాణాలను బంద్ చేశారు. ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేతపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసూ ముస్లిం మత సంస్థలు నగరంలో బంద్‌కు పిలుపు నిచ్చాయి. ఈమేరకు నగరంలో మైనారిటీ ఏరియాల్లో వ్యాపార సంస్థలు మూసి ఉంచి నిరసన తెలిపారు.

ఇజ్రాయిల్ దాడులను ఆపాలి



నిజామాబాద్ సిటీ: పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను వెంటనే ఆపాలని ఎంసీపీఐ(యు) జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. వామపక్ష పార్టీల పిలుపు మేరకు సోమవారం నగరంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కార్యదర్శి కర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇజ్రాయిల్‌కు అమెరికా ఆయుధాల సరఫరాను ఆపాలన్నారు. పాలస్తీనా ప్రజలపై అనిచివేతపై ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకోవాలన్నారు. నాయకులు అంజన్న, సామేలు, నరసయ్య, సంగీత, సాయిలు, గంగాధర్ తదితరులు ఉన్నారు.

నియామకం



నిజామాబాద్‌అర్బన్: హైదరాబాద్‌లో ఇటీవల తెలంగాణ రాష్ట్ర గౌడ్ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఎస్ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ మారయ్యగౌడ్‌ను అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఆయన నియామకంపై జిల్లాలోని గౌడ సంఘాల ప్రతినిధులు సోమవారం హర్షం వ్యక్తం చేశారు.

సిర్‌పూర్‌లో వన్యప్రాణి వారోత్సవాలు



మోపాల్: మండలంలోని సిర్‌పూర్ అటవీ ప్రాంతంలో సోమవారం 70వ వన్యప్రాణి వారోత్సవాలను అటవీశాఖ అధికారులు నిర్వహించారు. ఈసందర్భంగా అటవీ ప్రాంతంలో వారు ట్రెకింగ్ చేశారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని, అటవీ జంతువులను వేటాడటం చట్టరీత్యా నేరమని ఎఫ్ఎస్ఓ బాసిద్ తెలిపారు. సిబ్బంది సాయికుమార్, ఉదయ్, లింగన్న, లింబాద్రి, విజయభారతి, ప్రవీణ్, రవి, దేవిదాస్ పాల్గొన్నారు.

ఒక్కేసి పువ్వేసి చందమామ



కంజర్‌లో బతుకమ్మలతో చిన్నారులు.. జలాల్‌పూర్‌లో.. ఆకుల కొండూర్ గ్రామంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

సాక్షి నెట్‌వర్క్: నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో బతుకమ్మ సంబురాలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. సోమవారం పలు గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు, యువతులు చేమంతి, బంతి, గునుక తీరొక్క పువ్వులతో బతుకమ్మను అందంగా పేర్చి పూజలు చేశారు. ఇళ్ల ముందు, ప్రధాన వీధుల్లో, ఆలయాల వద్ద బతుకమ్మలను ఏర్పాటు చేసి వాటి చుట్టూ బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడారు. అనంతరం స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు. అలాగే వెంట తెచ్చుకున్న సద్దులను ఆరగించి, తిరిగి ఇళ్లకు వెళ్లారు. పలు గ్రామాల్లో కోలాటమడుతూ బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేశారు.

నేడు బల్దియాలో బతుకమ్మ సంబురాలు

మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం (నేడు) బతుకమ్మ సంబురాలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మకరందు ఒక ప్రకటనలో తెలిపారు. నేడు సాయంత్రం బల్దియా కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్న వేడుకల్లో మేయర్ నీతూకిరణ్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పాల్గొననున్నట్లు తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలోని వివిధ శాఖల అధిపతులు, మహిళా సిబ్బంది హాజరుకావాలన్నారు.



డిచ్‌పల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



గంగాస్థాన్ మున్నూరుకాపు సంఘంలో..



జాలాల్‌పూర్ గ్రామంలో..



మోపాల్‌లో..



నగరంలోని 17వ డివిజన్‌లో..

బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి కృషి



నగరంలో బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న పార్టీ నాయకులు

సుభాష్‌నగర్ : దేశంలోని కులవృత్తులను ప్రోత్సహిస్తూ, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తుందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమాల ఆనంద్ గౌడ్ అన్నారు. నగరంలోని గంజ్ కమాన్ ధర్మకాంట వద్ద సోమవారం ఆయన స్వర్ణకారులు, శాలివాహన (కుమ్మరి) కులస్తులను కలిసి బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాసు స్వామి యాదవ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ బడుగు, బలహీనవర్గాల ప్రజల కోసం వివిధ సంక్షేమ పథకాలను ప్రారంభించి, ఆర్థికసాయం అందజేస్తున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా అన్నివర్గాలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బీజేపీ సభ్యత్వాన్ని తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. బీజేపీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా పోలింగ్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడం కోసం మెంబర్‌షిప్ డ్రైవ్ చేపడుతుందన్నారు. ప్రతి బూత్‌లో కచ్చితంగా 200 మంది సభ్యులను బీజేపీలో చేర్పేవిధంగా బూత్‌స్థాయి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. అంతకుముందు బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆనంద్ గౌడ్‌ను అధ్యక్షుడు దినేష్ కులాచారి సన్మానించారు. నాయకులు రచ్చ సుదర్శన్, మాస్టర్ శంకర్, కోడూరు నాగరాజు, ఇప్పకాయల కిషోర్, గిరిబాబు, నారాయణ యాదవ్, లింబాద్రి, హరిప్రసాద్, శ్రీనివాస్, మారెడ్డి సురేష్, శ్రావణ్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ కోత.. ఇబ్బందుల్లో ప్రజలు



విద్యుత్ అధికారులతో మాట్లాడుతున్న గ్రామస్తులు

ధర్పల్లి: మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో సాంకేతిక కారణాల వల్ల సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు కరెంటు లేకపోవడంతో ధర్పల్లి, సీతాయిపేట్ గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ధర్పల్లి సబ్ స్టేషన్ పరిధిలో తరచూ విద్యుత్ కోతలు విధించడంతో వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ కోతలను నిరసిస్తూ గ్రామస్తులు సబ్‌స్టేషన్‌కు తరలివెళ్లి విద్యుత్‌శాఖ అధికారులను నిలదీశారు. విద్యుత్ సమస్య పరిష్కారం కోసం గతంలో విజ్ఞప్తి చేసినా ఎందుకు పట్టించుకోవడంలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సబ్ స్టేషన్‌లో టీసీలు కాలిపోవడంతోనే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని అధికారులు గ్రామస్తులకు వివరించారు. మరమ్మతులు చేపట్టామని, విద్యుత్‌ను పునరుద్ధరిస్తామని అధికారులు గ్రామస్తులకు తెలిపారు. మరమ్మతు పనులను డీఈ ఉత్తమ్ జాదవ్, ఏడీ శ్రీనివాస్ పర్యవేక్షించారు.

ఆలూర్‌లో హలాల్ నిషేధం



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో హలాల్ నిషేధిస్తూ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం తీర్మానం చేశారు. గ్రామంలో హిందూ దేవతల వద్ద హలాల్ నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వీడీసీ అధ్యక్షుడు బార్ల ముత్యంరెడ్డి తెలియజేశారు. అలాగే గ్రామంలో గంజాయి వినియోగించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. వీడీసీ సభ్యులు నవనీత్, సంతోష్, గంగా రెడ్డి, దుమ్మాజి శ్రీనివాస్, సుమన్, రాములు, జాన్, మల్లేష్, మగ్గిడి గంగా రెడ్డి, భాస్కర్, రాజేందర్, అశోక్, నాగేష్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి



రెంజల్(బోధన్): ధాన్యం, సోయా కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని ప్రగతి శీల రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు సోమవారం రెంజల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పుట్టి నాగన్న మాట్లాడుతూ.. రైతులు వరి కోతలు ప్రారంభించి 15 రోజులు గడుస్తున్నా.. ప్రభుత్వం ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో సరికాదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వరికి బోనస్‌ను అందించాలని, సోయాలకు సైతం బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్తం

విద్యార్థుల క్షేత్ర పర్యటన



సిరికొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల విద్యార్థులు సోమవారం వ్యవసాయ పొలాల వద్దకు క్షేత్ర పర్యటనకు వెళ్లారు. విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులపై ఉపాధ్యాయుడు సాయివినయ్ అవగాహన కల్పించారు. పంటల సాగు, విత్తనాల ఎంపిక, ఎరువుల వినియోగం, సేంద్రియ వ్యవసాయం గురించి విశదీకరించారు. ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో మందుల గురించి వివరించారు. కేంద్రం నిర్వాహకుడు ప్రశాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



నిజామాబాద్‌సిటీ: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన ముప్పగంగారెడ్డికి, పాలకవర్గానికి సోమవారం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్‌యార్డ్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని ఆకాంక్షించారు. యూనియన్ నాయకులు పరశురాం, శ్రీహరి, నరేష్, మార్కెట్‌యార్డ్ హమాలీ, కార్మికులు ఉన్నారు.

మోపాల్‌లో సామాజిక తనిఖీ



మోపాల్: మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2023–24 పనులపై గ్రామసభ నిర్వహించారు. సామాజిక తనిఖీ బృందం అధికారులు పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో రాములు, కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ఎస్ఆర్‌పీ పాండురంగ, డీఆర్‌పీ వెంకటేశ్, ప్రభులాల్, ఉపాధిహామీ సిబ్బంది సరిత, సాగర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

భగవద్గీత అందజేత



సుభాష్‌నగర్:యాదగిరిగుట్ట ఆలయంలోని 9మంది స్థపతుల్లో ఒకరైన మోతీలాల్ స్థపతికి సోమవారం మంచాల శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్ అధినేత మంచాల జ్ఞానేందర్ భగవద్గీతను అందజేశారు. అనంతరం ఆయనను సన్మానించి, ఆశీర్వాదం తీసుకున్నారు. మోతీలాల్ స్థపతి మాట్లాడుతూ.. ప్రతి ఇంట్లో భగవద్గీత ఉండాలన్న ఉద్దేశం మంచిదని జ్ఞానేందర్‌ను అభినందించారు.

నేడు మండలస్థాయి ప్రజావేదిక

మోపాల్: ఉపాధిహామీ పథకంలో భాగంగా 2023–24వ సంవత్సరంలో జరిగిన పనులపై మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో 3వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాములు నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలస్థాయి ప్రజావేదిక కార్యక్రమానికి ఉపాధిహామీ సిబ్బంది, పోస్టల్, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత


మోపాల్: మండలంలోని సిర్‌పూర్ అటవీప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు సెక్షన్ ఆఫీసర్ బాసిద్, బీట్ ఆఫీసర్ సంయుక్త సోమవారం తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి అటవీశాఖ డివిజనల్ కార్యాలయానికి తరలించారు. ట్రాక్టర్ యజమాని నరేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా రెండ్రోజుల క్రితం మల్లారం గ్రామానికి చెందిన శ్రీనివాస్ కూడా అటవీ ప్రాంతం నుంచి ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

దుర్గామాత నమోస్తుతే..



న్యావనందిలో కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు

సాక్షి నెట్‌వర్క్: నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం పలుచోట్ల అమ్మవారిని సరస్వతి దేవిగా, స్కంద మాతగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లాకేంద్రంతోపాటు పలు గ్రామాల్లోని దేవి మండపాల వద్ద మహిళలు కుంకుమార్చనలు, దీపారాధన, కలశపూజలు నిర్వహించారు. అలాగే మండపాల నిర్వాహకులు అన్నదానాలు ఏర్పాటు చేశారు. నగరంలోని వివిధ మండలిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయి.



కిషన్‌గంజ్‌లో కొలువుదీరిన అమ్మవారు



కన్యకాపరమేశ్వరాలయంలో..



గడ్కోల్‌లో అన్నదానం నిర్వహిస్తున్న యువకులు



డిచ్‌పల్లి మండల కేంద్రంలో..



న్యాల్‌కల్ రోడ్డులోని లలితాదేవి ఆశ్రమంలో..



ఘన్‌పూర్ గ్రామంలో..

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	78,400	వెండి (కిలో)	96,000
22 క్యారెట్స్	72,335		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	35	60	గాజరుగడ్డ	50	80
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	25	50
బీరకాయ	40	60	దోసకాయ	40	60
దొండ	40	60	ఆలుగడ్డ	25	50
బీర్నీసు	50	80	గోబిగడ్డ	20	40
కాకరకాయ	40	80	గోబిపువ్వు	40	60
వంకాయ	40	60	బీట్‌రూట్	45	75
పాలకూర	70	100	కరివేపాకు	50	75
మెంతికూర	60	100	చామగడ్డ	50	75
కొత్తిమీర	60	90	గోరుచిక్కుడు	40	60
పుదీనా	60	90	చిక్కుడు	40	60
క్యాప్సికం	60	90			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	దేవర పార్ట్-1 (తెలుగు)-9.10 12.20 3.40 7.00 10.20
స్క్రీన్-2	దేవర పార్ట్-1 (తెలుగు)- 10.30; చిట్టి పొట్టి(తెలుగు)-7.30; సత్యం సుందరం(తెలుగు)- 10.10
స్క్రీన్-3	సత్యం సుందరం(తెలుగు)- 12.35 4.00 7.20 10.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	దేవర పార్ట్-1(తెలుగు)- 11.15 2.50 6.25 10.00
స్క్రీన్-3	మత్తువదలరా-02(తెలుగు)-12.30 3.00 6.00 9.00
స్క్రీన్-4	సత్యం సుందరం (తెలుగు) - 11.00 2.40 6.20 10.00
లలితామహల్	దేవర పార్ట్-1(తెలుగు)
దేవి	సత్యం సుందరం (తెలుగు)
నటరాజ్	దేవర పార్ట్-1(తెలుగు)
విజయ్	దేవర పార్ట్-1(తెలుగు)

ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలి

తెయూ(డిచ్‌పల్లి): ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని ఎంఎస్ఎఫ్ తెయూ నాయకులు డిమాండ్ చేశారు. తెయూలో సోమవారం ఎంఎస్ఎఫ్ తెలంగాణ యూనివర్సిటీ అధ్యక్షుడు దినేష్ మాదిగ మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించి ఇచ్చిన ప్రతి నోటిఫికేషన్‌లో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి హామీనిచ్చారన్నారు. కానీ ప్రస్తుతం చేపట్టిన టీచర్ పోస్టుల భర్తీలో ఎస్సీ వర్గీకరణ లేకుండా నియామకాలు చేపట్టడం సరికాదన్నారు. సీఎం వైఖరిని నిరసిస్తూ ఈనెల 9న అన్ని జిల్లాలు, మండలాలలో నల్లజెండాలతో నిరసనస్తూ ప్రదర్శనలు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే హైదరాబాద్‌లో భారీ ర్యాలీ చేపడతామన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్‌వైర్ చోరీ

ఎడపల్లి: మండలంలోని దుబ్బతండా గ్రామ శివారులో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్‌వైర్, ఆయిల్‌ను చోరీ చేశారని గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన రైతులు బీమ్లానాయక్, సురేష్, శ్రీనివాస్ పంటపొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేయడంతో వారు విద్యుత్‌శాఖ అధికారులకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆర్మూర్ సి. ప్రభాకర్ ACO : 9010585333
నిజామాబాద్ అర్బన్ & రూరల్ జి. రాంబాబ్ : 9849180084
బాల్కొండ ప్రదీప్ : 7893150102
బోధన్ ఎ.శివ : 9848956776
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899